క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్–2 డీఈఈ ఎస్.గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. అలాగే డీ–12 సెక్షన్ పరిధిలో రోడ్ వైండింగ్ కారణంగా ఆర్ అండ్ బీ, మిర్చియార్డు, అంకిరెడ్డిపాలెం, ఆదర్శనగర్, మహర్షినగర్, యానాద కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని టీ–3 డీఈఈ రాజమోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉచిత మెడికల్ క్యాంపు

గుంటూరు లీగల్: జిల్లా కోర్టు ఆవరణలో ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సంయుక్తంగా శుక్రవారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో రోగ నిర్ధారణ కోసం వివిధ రోగాలకు సంబంధించిన ఫస్ట్ ఎయిడ్ పరీక్షలు చేశారు. కార్యక్రమానికి గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యంగళ శెట్టి శివ సూర్యనారాయణ సహాయ సహకారాలు అందించారు.

అలరించిన భక్తి సంకీర్తన

నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ సాయిబాబా దేవాలయంలో శుక్రవారం స్వరరాగ సుధా భక్తి సంకీర్తన నిర్వహించారు. కేవీ సాయిబాబాశర్మ బృందం పలు భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం కశ్మీర్‌లో అమాయకుల ఊచకోతను నిరసనగా, మృతుల ఆత్మ శాంతించాలని సద్గతులు ప్రాప్తించాలని వారు కోరారు. కార్యక్రమంలో విశ్రాంత బ్యాంక్ అధికారి డీవీఎస్ రామచంద్రరావు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు తమలోని సృజనాత్మక నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో శుక్రవారం వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వర శాస్త్రి మాట్లాడారు. వ్యాయామ అధ్యాపకుడు ఆర్.శివాజీ మాట్లాడుతూ శిబిరంలో క్రీడాకారులకు క్రికెట్, షూటింగ్, వాలీబాల్, ఫుట్ బాల్, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్‌లో నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళీధర్, గుంటూరు జిల్లా జాతీయ సేవా పథక నోడల్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

అంబటి రాంబాబును కలిసిన కోటిరెడ్డి



పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబును జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తియ్యగూర కోటిరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్ధార్థనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మామిడిరాము, పి.రమేష్, చదలవాడ వేణుబాబు, తదితరులు పాల్గొన్నారు.

మే 1 నుంచి సమ్మర్ క్యాంప్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఆసక్తి కల్గిన 14 ఏళ్లలోపు బాలబాలికలు స్టేడియం, స్విమ్మింగ్ పూల్‌లో శనివారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మే 1వ తేదీ నుంచి 31 వరకు క్యాంప్ ఉంటుందని చెప్పారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు క్యాంప్ జరుగుతుందన్నారు. క్యాంప్‌లో అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, స్కేటింగ్, టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా ధ్యానం, టేబుల్ టెన్నిస్, స్విమ్మింగ్ అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు. నెల రోజుల శిక్షణ అనంతరం జరిగే క్యాంప్ ముగింపు కార్యక్రమంలో ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లు, బహుమతులు అందిజేయనున్నట్లు పేర్కొన్నారు.

సర్వేలను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించండి


నెహ్రూనగర్: సర్వేల పేరిట సచివాలయ ఉద్యోగులను గత 8 నెలల నుంచి తీవ్ర పని ఒత్తిడికి గురి చేస్తున్నారు.. సర్వేల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్లో అవగాహనా కల్పించకపోవడం వలన అనేక చోట్లా ప్రజలు ఉద్యోగులకు సహకరించకపోగా అవమానకర రీతిలో మట్లాడుతున్నారని సర్వేలను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ఎంఆధార్‌తో ఎంతో ఉపయోగం

- జాగ్రత్తగా లేకుంటే.. సొమ్ము కొట్టేస్తారు
- ఖాతాదారుడి ప్రమేయం లేకుండానే నగదు కాజేతకు అవకాశాలు
- అప్రమత్తంగా ఉండాలన్న పోలీస్ అధికారులు

‘గత కొద్ది జుల క్రితం పొన్నూరు రోడ్డుకు చెందిన ఒక మహిళ బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.8 వేలు డ్రా అయ్యాయి. ఎలా అయ్యాయి అనే సంగతి మాత్రం ఆమెకు తెలియదు. పైగా ఆమె వాడేది కేవలం కీప్యాడ్ ఫోన్ మాత్రమే. ఆండ్రాయిడ్ ఫోన్ అయితే.. ఏదైనా లింక్ క్లిక్ చేసిందని అనుకోవచ్చు.’ పలు జిల్లాల్లో ఇప్పటికే ఇటువంటి ఘటనలు చోటు చేసుకున్న పరిస్థితులు ఉన్నాయి.

పట్నంబజారు: సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలో నేరాలకు పాల్పడుతున్నారు. వేలిముద్రలను ఆధారంగా చేసుకుని బ్యాంకుల్లో దాచుకున్న సొమ్మును ఖాతాదారుని ప్రమేయం లేకుండానే ఇట్టే దోచేస్తున్నారు. పెద్ద మొత్తంలో నగదు దోచేస్తే పట్టుకుంటారన్న ఆలోచనలతో రూ.10 వేలలోపు ఉండే చిన్న చిన్న మొత్తాలను కాజేస్తున్నారు. బాధితులు ఈ మోసాన్ని గుర్తించి బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేసినా పెద్దగా స్పందన లేకపోవడం, పోలీసుస్టేషను ఏం వెళ్తామని అనుకోవడంతో ఈ తరహా మోసాలు అధికమయ్యాయి. ఇలాంటి వాటికి ఎంఆధార్ యాప్‌తో చెక్ పెట్టవచ్చు.



ఏఈపీఎస్ ద్వారా..

డిజిటల్ ఇండియాలో భాగంగా బ్యాంకు సేవలను విస్తరించారు. ప్రభుత్వ పథకాల లబ్ధి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతుండడంతో కుగ్రామాల్లోని ప్రజలు పెద్ద సంఖ్యలో బ్యాంకు ఖాతాలు తెరిచారు. అయితే చాలాచోట్ల పల్లెల్లో బ్యాంకులు ఎక్కువ దూరంగా ఉండడం, ఏటీఎంలు అందుబాటులో లేకపోవడంతో ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం(ఏఈపీఎస్)ను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. పాస్ బుక్, ఏటీఎం కార్డు లేకుండానే చేతి వేలిముద్రల ద్వారా రోజుకు రూ.10 వేలు మాత్రమే డ్రా చేసుకునే అవకాశం ఉంది.

ఏం చేస్తున్నారంటే...

సైబర్ నేరగాళ్లు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్(ఐజీఆర్ఎస్) వెబ్‌సైట్ నుంచి ఆస్తి కొనుగోలుదారుల దస్తావేజులు డౌన్లోడ్ చేసుకుంటున్నారు. అందులోని వేలిముద్రలు, ఆధార్ నంబర్‌ను సేకరిస్తున్నారు. ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం ద్వారా బాధితుడి ఆధార్ నంబర్, వేలిముద్రలను స్కాన్ చేసి నగదు స్వాహా చేస్తున్నారు. పలువురు నేరగాళ్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, మరి కొందరు సిమ్‌కార్డులు విక్రయించే వారి దగ్గర నుంచి ఆధార్, వేలిముద్రలు సేకరించి బ్యాంకు ఖాతాల్లోని నగదు దోచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

ఇలా చేస్తే..

ఎంఆధార్ యాప్‌తో భద్రత లభిస్తుంది. దీనిని ప్లేస్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకుని అందులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కుటుంబ సభ్యులందరి ఆధార్ వేలిముద్రలను లాక్ చేసుకోవాలి. ఒక్కసారి వేలిముద్రలను లాక్ చేస్తే ఎక్కడా ఓపెన్ కావు. మనం వేలిముద్రలు వేయాలన్నా లాక్‌ను అన్‌లాక్ చేయాల్సిందే. తద్వారా నగదు కోల్పోయే అవకాశం ఉండదు.

వేలిముద్రలను లాక్ చేసుకోండి



సైబర్ నేరగాళ్ల విజయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏఈపీఎస్ విధానం ద్వారా నకిలీ వేలిముద్రలతో నగదు కాజేసే అవకాశాలు ఉన్నాయి. ఈ తరహా మోసాలకు గురికాకుండా ఉండాలంటే ఎంఆధార్ యాప్ ద్వారా ప్రతి ఒక్కరూ వేలిముద్రలు (బయోమెట్రిక్)ను లాక్ చేసుకోవాలి. అవసరమైనప్పుడు మాత్రమే అన్‌లాక్ చేసి, పని పూర్తయిన వెంటనే లాక్ చేయాలి. తద్వారా నగదు కోల్పోయే అవకాశం ఉండదు. ఇటీవల కాలంలో ఎక్కడైనా వేలిముద్రలు వేసిన సందర్భాలుంటే అక్కడికి వెళ్లి వేలి ముద్రలను డీలింక్ చేసుకోవాలి. వ్యక్తిగత సమాచారాన్ని, వేలిముద్రను అనవసరంగా ఎవరికీ ఇవ్వకూడదు. సైబర్ మోసాలకు గురైతే తక్షణమే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారాన్ని అందించాలి.

ఎస్.సతీష్‌కుమార్, ఎస్పీ, గుంటూరు జిల్లా

అలరించిన నృత్య కళాకారులు



స్వాతి ఆత్మనాథన్ (వారణాసి) భరత నాట్యం



హర్షిత కన్నడ యక్షగాన



సంపూర్ణ రాజ్యలక్ష్మి కూచిపూడి నృత్యం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నమయ్య కళావేదికపై 15వ అంతర్జాతీయ నృత్య దినోత్సవం శుక్రవారం కొనసాగాయి. శ్రీసాయిమంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ నిర్వహిస్తున్న మహామంజీర నాదం–2025 మూడో రోజుకు చేరాయి. పాలక మండలి ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సభకు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. పొరుగు రాష్ట్రాల నృత్య కళాకారులు తమ ప్రతిభతో ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. స్వాతి ఆత్మనాథన్ (వారణాసి) భరత నాట్యం, హర్షిత ఎస్‌వీఆర్ (హోన్నవర్, కర్ణాటక) కన్నడ యక్షగాన, యామవార సంపూర్ణ రాజ్యలక్ష్మి కూచిపూడి వంటి నృత్యాలతో అలరించారు. అనంతరం సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజ వెంకటసుబ్రహ్మణ్యం కళాకారులను యువ కళారత్న పురస్కారాలతో సత్కరించారు. పచ్చల నాగమహిత, వెంకటగిరి నాగలక్ష్మి పర్యవేక్షించారు.

ఉగ్ర దాడి దుర్మార్గమైన చర్య



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం నాయకులు



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, మేయర్ షేక్ సజీల



పెహల్‌గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొరిటిపాడు(గుంటూరు): కశ్మీర్‌లోని పహల్గామ్ పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి దుర్మార్గమైన చర్య అని జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం కార్యదర్శి సయ్యద్ బాషా పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ఏపీ, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఏపీటీబీఈఎఫ్) పిలుపు మేరకు జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం బ్యాంక్ ఎంప్లాయీస్ నాయకులు జీటీ రోడ్ లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) బ్రాడీపేట బ్రాంచ్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు ఎంతో పాశవికంగా దాడికి పాల్పడి భారతీయులను కాల్చి చపండం దారుణమన్నారు. దాడి చేసిన వారిని ఎలాంటి పరిస్థితుల్లో క్షమించరాదని, తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ముందుగా ఉగ్రవాదుల దాడిలో పర్యాటకుల మృతిపై మౌనం పాటించి శద్ధాంజలి ఘటించారు. జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం సలహాదారుడు పి.కిషోర్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామకృష్ణ, రవిచంద్రారెడ్డి, మురళి, షరీఫ్, వేణు, పావని, విజయక్రాంతి పాల్గొని మాట్లాడారు.

ఉగ్రవాదం నశించాలి..

గుంటూరు ఎడ్యుకేషన్: ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ అన్నారు. ఉగ్రదాడిని ఖండిస్తూ శుక్రవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిలో మరణించిన పర్యాటకులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం సాటి మనిషిని ప్రేమించడమేనని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఉగ్రవాదం ముక్త కంఠంతో ఖండించాలని, అందరం ఐక్యంగా శాంతిని కాపాడుకోవాలి అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందు, ఎండీ షకీలా బేగం, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమకుమార్ పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

లక్ష్మీపురం: సీపీఎం ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని కార్యాలయం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు పాశం రామారావు, కె.నళినీకాంత్ మాట్లాడుతూ పర్యాటకులపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపి చంపటం దుర్మార్గ చర్య అని పేర్కొన్నారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పర్యాటకులకు భద్రత కల్పించకపోవడంపై కేంద్ర ప్రభుత్వం వైఫల్యం కనిపిస్తుందన్నారు. ఇలాంటి సమయంలో ఐక్యంగా ఉగ్రవాద శక్తులు పాల్పడే చర్యలకు వ్యతిరేకంగా అందరూ ఖండించాలని అన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసీ యూనియన్ నాయకులు వీవీకే సురేష్, మెడికల్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు షేక్ అబ్దుల్ సలీం, జేవీవీ నాయకులు జి.వెంకటరావు, మహిళా సంఘం నగర కార్యదర్శి ఎ.కల్యాణి మాట్లాడారు. అలాగే ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ బాషా, ఖాశిం వలి, బి.సత్యనారాయణ, షేక్ ఖాశిం షహీద్ పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై సమగ్ర విచారణ జరిపాలి

లక్ష్మీపురం: పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సరైన భద్రత లేక పోవడం పైన ఉగ్రదాడి పైన సమగ్ర దర్యాప్తు జరిపి ముష్కరులను కఠినంగా శిక్షించాలని సంస్థ సీనియర్ సభ్యులు కవి బండికల్లు జమదగ్ని అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో విశ్రాంత అధికారి మల్లేశ్వరరావు, సంస్థ సభ్యుల సదాశివం, మురళీకృష్ణ, హరి ప్రసంగించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఉగ్రదాడిని ఖండిస్తూ గుజ్జనగుండ్లలో మానవ హారం

లక్ష్మీపురం: కశ్మీర్‌లో ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో గుజ్జనగుండ్ల సెంటర్ వద్ద శుక్రవారం మానవహారం చేపట్టారు. ఈ ఆవాజ్ రాష్ట్ర కమిటీ కన్వీనర్ చిష్టి మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని ఎవరు చేసినా దేశ ప్రజలందరూ కలిసికట్టుగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఇది ఏదో ఒక మతాన్ని అంటగట్టే ప్రయత్నం కొందరు చేస్తున్నారని అలాంటివారి ఉచ్చులో ప్రజలు పడవద్దు అని తెలిపారు. అమాయక ప్రజల ప్రాణాలను బలిగొన్న ఈ దుర్మార్గమైన ఘటనపై కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ ముస్తఫా, అవాజ్ కమిటీ బాషా, ఖలీల్, సుభాని, ముత వల్లీ, ఖాదర్, ముస్లిం ఐక్య వేదిక బాజీ, అల్లావలి, మైనార్టీ నాయకులు టోపీ బాబు, డాక్టర్ ఇషాక్, అక్బర్, కరీముల్లా పాల్గొన్నారు.

ఉగ్రదాడికి వ్యతిరేకంగా ర్యాలీ

పట్నంబజారు: కశ్మీర్‌లో ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.డి.నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మాయాబజారు నుంచి ప్రారంభించిన ర్యాలీ హిమని కూల్‌డ్రింక్ సెంటర్ వరకు జరిగింది. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ఉగ్రదాడిని ఖండించారు. ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి సంతాపం తెలిపారు. ర్యాలీలో నగర మేయర్ షేక్ సజీల, టీడీపీ నేతలు కె.రవీంద్ర, పి.రవి, గౌస్ పాల్గొన్నారు.

మే 14 నుంచి ఉచిత శిక్షణ తరగతులు



పోస్టర్లు విడుదల చేస్తున్న జూపూడి రంగరాజు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మే 14 నుంచి జూన్ ఏడో తేదీ వరకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు జూపూడి రంగరాజు తెలిపారు. శుక్రవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శిక్షణ తరగతుల పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా రంగరాజు మాట్లాడుతూ వేసవిలో హిందూ బంధువులకు భగవద్గీత, మార్షల్ ఆర్ట్స్, స్వీట్స్, ఫాస్ట్ ఫుడ్, కర్ణాటక శాస్త్రీయ సంగీతం, మగ్గం వర్క్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ అంశాల్లో బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షనా తరగతులను హిందూ బంధువులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత శిక్షణా తరగతులకు సంబంధించిన దరఖాస్తులు బ్రాడీపేట 3/10 లోని ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్మెంట్ సొసైటీ కార్యాలయంలో లభిస్తాయని, ఇర వివరాలకు ఆర్గనైజర్ గాయత్రి బెహరాను 9949148006 లో సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ గాయత్రి బెహరా, బీజేపీ రాష్ట్ర నాయకులు కొత్తూరు సుబ్బారావు, వనమా నరేంద్ర కుమార్, డాక్టర్ నిరంజన్, తుపాటి చిన్నికృష్ణ, సాయి, హైందవ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ బెహరా, జిల్లా అధ్యక్షుడు శంకర్ యాదవ్, హిందూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.సీతారామయ్య గారు, మహాదేవ హిందూ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కడియాల గోపి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ‘మీకోసం మేము’



మాట్లాడుతున్న డాక్టర్ యశస్వి రమణ, డాక్టర్ బిందు నర్మద, డాక్టర్ భార్గవి తదితరులు

గుంటూరు మెడికల్: స్థానిక జీజీహెచ్‌లో ప్రతిష్టాత్మకంగా మీ కోసం మేము డాక్టర్ పేషెంట్ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ ప్రతి శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆస్పత్రిలో ఉన్న రోగుల సహాయకులకు ఇంటర్నేషనల్ స్ట్రోక్ డే సందర్భంగా చెక్ బీపీ–స్టాప్ స్ట్రోక్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కలిగించారు. డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ బీపీని చెకప్ చేసుకోవడం గురించి వివరించారు. ఆహారపు అలవాట్లు, జీవన విధానం వలన బ్రెయిన్ స్ట్రోక్ రావడం చాలా సహజంగా మారిపోయిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా బీపీ చెక్ అప్ చేయించుకోవాలని కోరారు. బీపీ ఉన్నట్లు నిర్ధారణ అయితే తప్పనిసరిగా వైద్యులు సూచించిన మందులు నిరంతరం వాడాలని పేర్కొన్నారు. డాక్టర్ బిందు నర్మదా, డాక్టర్ భార్గవి ప్రజలకు అవగాహన కల్పించారు. వందమంది రోగుల సహాయకులు వారికి ఉన్న అనుమానాలు వైద్యులు నివృత్తి చేశారు.

కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు టెండర్ పొందిన కాంట్రాక్టర్లు తప్పనిరిగా నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కొరిటిపాడు, పెద్దపలకలూరు రోడ్, ఉద్యోగ నగర్, జేకేసీ నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. నాణ్యతపై ఫిర్యాదులు వస్తే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. సీసీ రోడ్ల ఏర్పాటుకు ముందే తప్పనిసరిగా డ్రెయిన్ నిర్మాణం చేయాలని పేర్కొన్నారు. సచివాలయాల వారీగా ఎమినిటి కార్యదర్శులు తాగునీటి సరఫరా సమయాల్లో శాంపిల్స్ సేకరించాలని, కలుషిత నీటి సరఫరా గుర్తిస్తే తక్షణం తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో డీఈఈలు రమేష్ బాబు, శ్రీనివాస్, ఎస్ఎస్ సోమశేఖర్ పాల్గొన్నారు.

బీపీ తెలుసుకోవడం అవసరం

ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ విజయ



జీజీహెచ్‌లో బీపీపై అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్: అధిక రక్తపోటు సైలెంట్ కిల్లర్ అని, చాలా మందికి తమకు బీపీ ఉందన్న విషయం తెలియక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్(ఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. ఐఎస్ఏ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో అధిక రక్తపోటుపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, ఉచిత బీపీ పరీక్ష శిబిరాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గుంటూరు జీజీహెచ్‌లో జరిగిన బీపీ పరీక్ష శిబిరంలో డాక్టర్ విజయ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారీ, న్యూరాలజీ అసోసియేషన్ నేతలు డాక్టర్ రామ్‌తారకనాధ్, డాక్టర్ ఉప్పుటూరి అరుణ, డాక్టర్ గొట్టిపాటి బిందునర్మద, డాక్టర్ వీరమ్మ, డాక్టర్ కుమార్‌వేల్, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ నవీన్, ఐఎంఏ నేతలు డాక్టర్ సుబ్బరాయుడు, డాక్టర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలోని కీట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు డీడీయూ జీకేవై కార్యక్రమం ద్వారా జూనియర్ సాఫ్ట్ వేర్ వెబ్ డెవలపర్ (జేఎస్డీ) కోర్సులో ఆరు నెలలపాటు ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి విద్యార్థికి జూనియర్ సాఫ్ట్ వేర్ డెవలపర్ కోర్సులో సాఫ్ట్‌వేర్ డెవలపర్, సీసీ ప్లస్ ప్లస్, జావా స్క్రిప్ట్, పైథాన్, వెబ్ డిజైనింగ్ కోర్సులతోపాటు స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్స్, లైఫ్ స్కిల్స్ నందు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని తెలిపారు. కంప్యూటర్ బ్యాక్ గ్రౌండ్‌తో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కోర్సులు పాస్, ఫెయిల్ అయిన 20 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణానంతరం ప్రతి విద్యార్థికి ప్రభుత్వ గుర్తింపుతో సర్టిఫికేట్ అందించి, వివిధ సంస్థల్లో నూరుశాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని సూచించారు. ఈనెల 28వ తేదీన బ్యాచ్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ఇక ఐదు రోజులే గడువు..

ఐదు శాతం రాయితీకి అవకాశం

నెహ్రూనగర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025–26) సంబంధించిన ఆస్తి పన్ను ముందస్తుగా ఏప్రిల్ నెలాఖరులోగా ఏక మొత్తంగా చెల్లించే వారికి మొత్తం పన్నుపై ఐదు శాతం రాయితీ లభిస్తుందని, ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఒకేసారి ఏక మొత్తంగా చెల్లిస్తే వారికి వడ్డీపై 50 శాతం రాయితీని కూడా ఈ నెలాఖరులోపు చెల్లించి పొందవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నును ముందస్తుగా ఏక మొత్తంగా చెల్లించే వారికి 5 శాతం రాయితీ అవకాశాన్ని కల్పించిందని, ఈ నెల 30లోగా ఆస్తి పన్నుని ఏక మొత్తంగా చెల్లిస్తే పన్ను రాయితీ లభిస్తుందన్నారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఒకేసారి ఏక మొత్తంగా చెల్లించే వారికి వడ్డీపై 50 శాతం రాయితీని కూడా ఈ నెలాఖరులోపు చెల్లించి పొందవచ్చన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో 8, సర్కిల్